నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
11 | హైదరాబాద్, బుధవారం 21 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

ఆస్మిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

గురుకులాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

- విద్యార్థినుల ఆత్మహత్యలు బాధాకరం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఆస్మిత కుటుంబ సభ్యులకు పరామర్శ

మోతె, ఫిబ్రవరి 20 : గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు కలిచి వేస్తున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇమాంపేట గురుకుల విద్యార్థిని ఆస్మిత ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె సొంతూరు మోతె మండలం బుర్కచర్లకు మంగళవారం కవిత వెళ్లారు. ఆస్మిత తల్లిని, కుటుంబ సభ్యులను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌తో కలిసి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే గురుకుల పాఠశాల పనితీరుపై సమీక్షించి ఆడబిడ్డల ప్రాణాలను కాపాడాలన్నారు. 10రోజుల్లో ఇమాంపేటలోని పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. రెండు వారాల క్రితం భువనగిరి గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడితో ఉన్నారా అన్నది ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

గురకులాలను ఏర్పాటు చేసి లక్షలాది మంది పిల్లలను చదివిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతుంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆడ పిల్లలు సున్నితంగా ఉంటారు కాబట్టి ఆత్మహత్య చేసుకునేంత స్థాయికి ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని, సమయానికి సిలబస్ పూర్తి, నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని కోరారు. ప్రస్తుతం విద్యా శాఖకు పూర్తి స్థాయి మంత్రి లేరని, దీనిపై సీఎం చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫ్రెండ్లీనేచర్ కల్పించాలని, సైకాలజిస్ట్‌లను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలని సూచించారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆస్మిత తల్లి ఇరుగు జ్యోతికి కవిత ఆర్థిక సాయం అందజేశారు.

అనంతరం ఆస్మిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని సతీశ్, కొండా వెంకన్న, నూకల శ్రీనివాస్‌రెడ్డి, వాసంశెట్టి రమేశ్, భూక్య గాంధీ, బాణోతు వెంకన్న, దేవ్లానాయక్, లక్కపాక ప్రవీణ్‌కుమార్, సంజీవరెడ్డి, జాన్‌రెడ్డి, గుండాల గంగులు, శంకర్‌నాయక్, మహేందర్ ఉన్నారు.

గొర్రెలకు మేతగా వరి పంట

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి20 : మండలంలోని కూరెళ్లలో రైతు మారుపాక అంజయ్య 5ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు వరి సాగు చేస్తున్నాడు. కాలం కాకపోవడంతో బావిలో జలాలు అడుగంటి పోయాయి. నీళ్లు అందక 5 ఎకరాల్లోని ఒక ఎకరం పంట ఎండిపోయింది. దాంతో అంజయయ్య మంగళవారం ఎండిపోయిన పొలాన్ని గొర్రెల మేత కోసం గొర్రెల కాపరులకు ఇచ్చాడు. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, ఎండిన పంట పొలాలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని రైతు అంజయ్య వేడుకుంటున్నారు.

పాతగుట్టలో వైభవంగా ధ్వజారోహణం

భేరిపూజ, దేవతాహ్వానం

నేటి నుంచి స్వామి వారి విశేష ఉత్సవాలు

యాదగిరిగట్ట, ఫిబ్రవరి 20 : యాదగిరి గుట్టలోని పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భేరి పూజ, గరుత్మంతుడితో దేవతాహ్వానం తంతును సంప్రదాయబద్ధంగా జరిపారు. బుధవారం నరసింహ స్వామి పెళ్లికొడుకుగా ముస్తాబవనున్నారు. ఈ సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం, వివాహ నిశ్చయ కార్యక్రమం చేపట్టనున్నారు. శ్రీమన్నారాయణుడి వాహనమైన గరుత్మంతుడిని ఆహ్వానించి సకల దేవతలకు యాదగిరీశుడు పెళ్లికొడుకు అవుతున్నారని సబ్బండ బంధుగణంతో తరలిరావాలనే ఆహ్వానాన్ని పంపే తంతును అర్చక బృందం ఆధ్వర్యంలోని వేద పండితులు, అర్చకులు, పారాయణికులు వేదమంత్రాల ఘోషలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ఉదయం పంచామృతాలతో ముస్తాబు చేసి పుష్పాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ధ్వజ స్తంభానికి ఎదురుగా ప్రత్యేక పీఠంపై అధిష్టింపజేసి ధ్వజారోహణం తంతు నిర్వహించారు. కుంకుమతో గరుత్మంతుడి చిత్రపటం వేసి, వేద పారాయణాలు, మంగళ వాయిద్యాలతో గరుడ దండకం చదువుతూ ఆలయ ధ్వజస్తంభంపై ఆలంకరించారు. ధ్వజ స్తంభానికి దర్భలతో తయారు చేసిన తాడుతో గరుత్మంతుడి చిత్రపటానికి వస్త్రాన్ని కట్టారు. అర్చకుల వేదోక్తమైన పాటలతో గరుత్మంతుడిని ఆహ్వానించారు. సామూహిక దీక్షాపరులైన వేద పారాయణికులచే చతుర్వేద పారాయణం, పురాణ, ఇతిహాస, ప్రబంధ, మూలమంత్ర, మూర్తిమంత్ర జపాలతో ధ్వజారోహణ ఉత్సవాన్ని నిర్వహించారు.

గరుడముద్దలు ఎగరేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

ఆలయంలో హవనం..

బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు ఎదురుగా అగ్నిప్రతిష్ఠ చేసి, ఆ అగ్నిలో రాగి, మేడి, జువ్వి, మోదుగు, మామిడి చెట్ల కర్రలతో హోమాన్ని వెలిగించారు. అందులో నారాయణ, లక్ష్మి, సుదర్శన, నారసింహ, ఆంజనేయ, గరుడ మొదలైన మూలమంత్రాలతో హవనం చేశారు.

దేవతలకు ఆహ్వానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యారాధనల అనంతరం వేదపారాయణాలు, మూల మంత్రాలు, అనుష్ఠానం గావించారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి అంశ అయిన లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలకు 33 కోట్ల దేవతలను ఆహ్వానించే ప్రక్రియ దేవతాహ్వానాన్ని సాయంత్రం నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు భేరిపూజ జరిపారు. సకల దేవతలకు భేరి నినాదాలు, మంగళవాయిద్యాలతో రాగ, తాళయుక్తంగా ఆవాహనం చేసి గర్భాలయంలోని ప్రధాన కలశంలో అధిష్ఠింపజేశారు. సకల మూలమంత్రాలతో హవనం జరిపారు. ఈ వేడుకల్లో ఆలయ ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞికులు కిరణ్‌కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థీఘశ్ సీతామనోహరాచార్యులు, పారాయణదారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు ఎదుర్కోలు

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు హవనం, సింహ వాహన సేవ, సాయంత్రం 6 గంటలకు హవనం, రాత్రి 8 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం జరిపించనున్నారు. రాత్రికి శ్రీవారు అశ్వవాహన సేవలో ఊరేగనున్నారు. అనంతరం శ్రీవారి విహహ నిశ్చయ గడియలు ఖరారు చేసే తంతును రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు.

పాతగుట్టలో దేవతాహ్వానం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు జెండగే

ఇంటర్, టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : రాబోయే ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్మీడియట్, విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులతో పరీక్షలకు తీసుకోవాల్సిన చర్యలు, బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ఉంటాయని, జిల్లాలో 30 పరీక్ష కేంద్రాల్లో మొదటి, రెండో సంవత్సరం కలిపి మొత్తం 12,559 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, 9 గంటల తరువాత పరీక్ష కేంద్రాల లోపలికి విద్యార్థులకు అనుమతి ఉండదని చెప్పారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, మొత్తం 51 పరీక్షా కేంద్రాల్లో 9,402 మంది విద్యార్థులు ఎగ్జామ్స్ రాస్తారని అన్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదని, తాగునీరు, టాయ్‌లెట్స్, ఫ్యాన్లు, వెలుతురు, తగిన వసతులు కల్పించాలని, ప్రాథమిక చికిత్సతోపాటు వైద్య బృందాలు అందుబాటులో ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తగినంత ఫర్నిచర్‌తోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పరీక్ష సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను క్లోజ్డ్ వెహికిల్స్‌లో తరలించే విధంగా విద్యాశాఖ, తపాల శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్ర మాట్లాడుతూ అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తగినంత బందోబస్తు ఏర్పాటు చేస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కరరావు, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఫ్లాప్ షో..

- తుస్సుమన్న విజయ సంకల్ప యాత్ర సభ
- ముఖ్య అతిథిగా గోవా సీఎం హాజరు
- కాలేజీ గ్రౌండ్ సభలో సగం కుర్చీలు ఖాళీ
- రెండు వేల మందితోనే మమ
- గోవా సీఎం మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన జనం
- చప్పగా సాగిన కమలం శ్రేణుల యాత్ర
- కాషాయ పార్టీలో ఎక్కడా కనిపించని జోష్

రెండు వేల మందితోనే సభ..

సాధారణంగా బహిరంగ సభ అంటేనే భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివస్తారు. అలాంటి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభ తుస్సుమన్నది. మైదానం 7ఎకరాలు ఉండగా, కేవలం ఎకరంలోపు స్థలంలోనే సభను నిర్వహించారు. అందులోనే కుర్చీలు ఏర్పాటు చేశారు. స్టేజీ ముందు వేసిన కుర్చీలు సగం కూడా నిండలేదు. సభకు వచ్చిన వారిలో సైతం సగం మంది మధ్యలోనే వెళ్లిపోయారు. గోవా సీఎం మాట్లాడే సమయంలో జనమే లేకపోవడం గమనార్హం. జనం బయటకు వెళ్తుంటే బీజేపీ శ్రేణులు ఆపే ప్రయత్రం చేసినా ఆగలేదు. ఒక రాష్ట్రానికి సీఎం హాజరైన తరుణం, పెద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సభ పేలవంగా నిర్వహించడమేంటని సభలోనే అందరూ పెదవి విరిచారు.

బీజేపీ సభలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

పసలేని ప్రసంగాలు..

సభ ఆసాంతంలో ఒక్కసారి కూడా జోష్ కనిపించకపోవడం గమనార్హం. బీజేపీ శ్రేణులు, ప్రజల నుంచి కనీసం స్పందన లేదు. పైగా సభలో బీజేపీ నేతలు చేసిన ప్రసంగాలు చప్పగా సాగాయి. కొందరు నేతలు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను కాదని, ప్రతిపక్షంలో బీఆర్ఎస్‌ను తిట్టడం ఏంటనే చర్చ జరిగింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఆరు గ్యారెంటీల అమలు చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీని కనీసం కార్నర్ చేయలేదని పలువురు అనుకోవడం కనిపించింది. ఇక ఈటల రాజేందర్, బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు ప్రసంగించే సమయంలో త్వరగా ముగియాలని పదేపదే చెప్పడం కనిపించింది. ఈటల రాజేందర్ మాట్లాడుతున్నప్పుడు ఆపే ప్రయత్నం చేయగా.. 'టైం అయ్యిందా'' అని ఈటల ఒక రకమైన స్వరంతో అనడంతో అంతా సైలెంట్ అయ్యారు.

అంతా గందరగోళం..

బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభ ఆసాంతం గందరగోళంగా సాగింది. కొందరి నేతలను వేదికపైకి పిలువలేదని అలిగారు. వారిని మళ్లీ వేదికపైకి పిలువాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పుల బాషా పిలువలేదని అనడంతో, పిలిచామని మైక్‌లోనే ఓ నేత అనడం కనిపించింది. వేదికపై మహిళలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒక్క మహిళకు మాత్రమే వెనకాల రెండో లైన్ తర్వాత కూర్చోబెట్టారు. మరోవైపు బీజేపీ నేతలు గూడూరు నారాయణరెడ్డి, పీవీ శ్యామ్‌సుందర్ హాజరు కాలేదు.

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎప్పటిలాగానే బీజేపీ సభ వెలవెలబోయింది. ఏదో వచ్చామా.. కనిపించామా.. వెళ్లిపోయామా.. అన్నట్టుగా నేతలు నామ్‌కే వాస్తేగా సభను కానిచ్చేశారు. గోవా ముఖ్యమంత్రి హాజరైన బహిరంగ సభలో కనీసం రెండు వేల మంది కూడా హాజరు కాలేదు. సగం కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఓవరాల్‌గా బీజేపీ సభ చప్పగా సాగింది.

రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయ సంకల్ప యాత్రలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా భువనగిరికి సంబంధించి భాగ్యలక్ష్మి క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. భువనగిరి పార్లమెంట్ పరిధితోపాటు మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనున్నది. తొలి రోజు భువనగిరి పట్టణంలో యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం భువనగిరి జూనియర్ కళాశాల మైదానంలో సభను ఏర్పాటు చేశారు. దీనికి గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు నేతలు హాజరయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నా సభ ప్లాఫ్ అయ్యింది. ఏర్పాట్లతో మొదలుకొని, సభ జరిగిన తీరు వరకు అంతటా గందరగోళం నెలకొంది.

పార్వతీ పరమేశ్వరుల అశ్వ వాహన సేవ

చెర్వుగట్టులో అశ్వవాహన సేవ

- వైభవంగా రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి పుష్పోత్సవం, ఏకాంత సేవలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20 : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులు అశ్వ వాహనంపై విహరించి భక్తులను కనువిందు చేశారు. ఈ సందర్భంగా మహా మండపం వద్ద 108 కలశాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. మన్యు సూక్తి హోమం, బలిహరణ, జయాధి హోమం, ధ్వజారోహణం, త్రిశూల స్నానం, వసంతోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులకు చందనాభిషేకం, క్షేత్ర పాలక కాల భైరవుడికి అభిషేకాలు జరిపారు. స్వామివారికి వైభవంగా పుష్పోత్సవం, ఏకాంత సేవలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, దేవాదాయ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ నవీన్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

నేడు గ్రామోత్సవం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడెం గ్రామాల్లో పార్వతీ జడల రామలింగేశ్వర స్వామిని గజవాహనంపై ఊరేగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చిన్న మేడారంలో ఎల్లమ్మకు బోనాలు తీసుకొస్తున్న మహిళలు

వన దేవతల జాతర ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు

రాజాపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని చిన్న మేడారం చల్లూరులోని యాదాద్రి మేడారం దేవతల జనజాతర మంగళవారం ఎల్లమ్మ బోనాలతో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కుర్రారం, బూర్గుపల్లి, చల్లూరులో స్థానిక మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ప్రదర్శనగా వెళ్లి ఎల్లమ్మకు నైవేద్యం సమర్పించారు. దేవతకు పసుపు, కుంకుమ గాజులు, ఒడిబియ్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తల్లులకు సమర్పించుకునేందుకు భక్తులు ఒడిబియ్యం, బంగారం, గొర్రెలు, మేకలు ఇతర వంట సామగ్రి తీసుకొని జారతకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. ఆలయ పరిసరాల్లో దుకాణాలు, హోటళ్లు పెద్ద ఎత్తున వెలిశాయి. గద్దెలకు సుమారు 2 కిలోమీటర్ల దూరం వరకు భక్తులు విడిది స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. మొక్కులు సమర్పించుకునేందుకు వన దేవతల రాక కోసం ఎదురు చూస్తున్నారు. సీఐ వేణుగోపాల్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు గద్దెలపైకి సారలమ్మ

భక్తుల ఆరాధ్య దైవమైన సారలమ్మ బుధవారం చల్లూరు, లక్ష్మక్కపల్లి, కుర్రారం గుట్టలపై నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గద్దెనెక్కనుంది. తల్లి ఆగమనం సమయంలో ఆలయ ప్రాంతం జన సంద్రమవుతుంది.

రెండు సంవత్సరాలకోసారి జరిగే పెద్ద మేడారం జాతర తరహాలో ఇక్కడ పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో మాచి సర్పంచ్ వంచ వీరారెడ్డి, చింతల మమతాసంపత్, వైస్ ఎంపీపీ కాయితీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాపోలు కవితాతిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ జాతర నిర్వహకులు భక్తులు పాల్గొన్నారు.

రోగి సంరక్షణకు నిరంతర పరిశోధనలు అవసరం

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా



సమావేశంలో మాట్లాడుతున్న బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, ఫిబ్రవరి 20 : రోగి సంరక్షణకు నిరంతర అభ్యాసం, పరిశోధనలు అవసరమని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో ఈఎన్‌టీ, హెడ్, నెక్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రవణ పునరావాసం అనే అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రవణ పునరావాస పద్ధతులు, అభ్యాసాలపై సమగ్ర పరిశోధనలు అవసరమన్నారు. ఆరోగ్య సంరక్షణ డెలివరీ, పరిశోధనల్లో ముఖ్యంగా వినికిడి లోపం ఉన్న వ్యక్తుల అవసరాలను తీర్చడంలో సంస్థ పనిచేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ రాహుల్ నరంగ్, బి.శ్రీనివాస్‌రావు, జీఎస్ పాటిల్, డాక్టర్ కృష్ణా మేధ, డాక్టర్ నీము హేగ్ పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయూజీకేవై) ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాలపరిమితితో కూడిన సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీస్ శిక్షణ కోర్సుకు పదో తరగతి పాస్, ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించబడునని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డుతో మార్చి 1న ఉదయం 10 గంటలకు రామానంద తీర్థ సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848908059, 9133908000, 9133908111, 9133908222 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య
- మృతిచెందిన విద్యార్థినుల కుటుంబాలకు న్యాయం చేస్తాం

సూర్యాపేట రూరల్/బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 20 : విద్యార్థులు మనోధైర్యంతో ఉండాలని, తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం అవుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య అన్నారు. సూర్యాపేట మండల పరిధి ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు చావే కారణం కాకుడాదని, ఏమైనా ఉంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినుల ఆత్మహత్యల ఘటనలు పునరావృతం కాకుండా అన్ని సంక్షేమ పాఠశాలలో మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చనిపోయిన విద్యార్థినుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం అందేలా తమ కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, భోజనశాలను, మరుగుదొడ్లను కమిటీ సభ్యులు పరిశీలించారు. వైష్ణవి, ఆస్మిత చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. వారి వెంట ఆర్డీఓ సీహెచ్.కృష్ణయ్య ఉన్నారు.

ఇమాంపేట గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు